## పనులు కల్పించలేదని క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కలికిరి

కూలీలకు పని కల్పించలేదని క్షేత్ర సహాయకుడిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. సోమవారం స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులకు మూడు నెలలుగా గాలేటి గిరి అనే క్షేత్ర సహాయకుడు కూలీలకు పని కల్పించలేదని ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినందున అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాల మునయ్య, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విచారణలో ప్రజలు క్షేత్ర సహాయకుడు మూడు నెలలుగా పనులు కల్పించలేదని తెలిపారు. విచారణకు వచ్చినటువంటి అధికారులు ప్రజలు ఇచ్చినటువంటి సమాచారాన్ని రిపోర్టు ద్వారా ప్రాజెక్టు డైరెక్టర్ వారికి తెలియజేస్తామని తదుపరి చర్యలు ప్రాజెక్టు డైరెక్టర్ తీసుకుంటారని నివేదికలపై అధికారికి అందజేస్తామని తెలిపారు. క్షేత్ర సహాయకుడు గాలేట గిరి స్వయంగా విచారణకు వచ్చిన అధికారులకు రాతపూర్వకముగా అర్జీ రాసి కూలీలు చెబుతున్నది నిజమేనని మూడు నెలలుగా విధులకు గాని, కార్యాలయానికి గాని వెళ్లడం లేదని పనులు కల్పించలేదని అధికారులకు రాసి ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఒ సుజాత, టిఎ మనోహర్, సంబంధిత అధికారులు, కూలీలు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడూ అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రీవెన్సును, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందిన్నారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌-ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని చెప్పారు. ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారో వారి సమస్యను సావధానంగా విని, ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

# ఇసుకను అక్రమంగా నిల్వచేస్తే కఠిన చర్యలు

### - కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఇసుక అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా చట్టపరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గనులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టరు, లారీ, ట్రిప్పరు యజమానులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఇసుకను పూర్తిగా ఉచితంగా ఇస్తోందన్నారు. కేవలం నిర్వహణ ఛార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లాలో ఇసుక సరఫరా అమలు విధానాన్ని, సరఫరా సందర్భంగా వాహన చోదకులకు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా, వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, వాహన యజమానులతో పలు అంశాలలో చర్చించారు. ఇసుక బుకింగ్ నిమిత్తం త్వరలో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొస్తోందని, అప్పటి నుంచి మరింత పటిష్టంగా ఇసుక సరఫరాను పర్యవేక్షణ చేయగలుగుతామని చెప్పారు. వాహన యజమానుల సలహాలను కూడా పరిగణలోకి తీసుకుని ఇసుక సరఫరాలో నిఘా నిమిత్తం జిల్లాలో అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్ట్‌ల ఏర్పాటు చేయాలని మైనింగ్, రవాణా, పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి వాహన యజమానుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి రవికుమార్, డిటిసి భరత్, పోలీస్ అధికారులు, ట్రాక్టరు, లారీ, ట్రిప్పరు యజమానులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

# డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా 'ఆకుపచ్చముగ్గు'

### - రచయిత వేంపల్లె షరీఫ్‌కు అరుదైన గౌరవం



రచయిత వేంపల్లె షరీఫ్ రాసిన ఆకుపచ్చముగ్గు కథ ముఖచిత్రం

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లా వేంపల్లెకు చెందిన కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ రాసిన 'ఆకుపచ్చముగ్గు' కథను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది నుంచి సామాజిక శాస్త్రాలు చదువుతున్న డిగ్రీ విద్యార్థుల్లో యునెస్కో ప్రతిపాదించిన శాంతి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేకంగా ఒక పేపరును 50 మార్కుల కోసం ప్రవేశపెట్టారు. సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు వీలుగా ఉన్న వేంపల్లె షరీఫ్ రాసిన కథ "ఆకుపచ్చ ముగ్గు"ను ఎంపిక చేశారు. ఇకపై బిఎ, బికాం, బిఎస్సీ, బిబిఎ చదువుతున్న విద్యార్థులు మూడవ సెమిస్టర్ కింద చదువుకోవాల్సిన పాఠ్యాంశాల్లో వేంపల్లె షరీఫ్ కథ కూడా ఉంది. మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని పైకొచ్చి రచనలు చేస్తున్న షరీఫ్ ఇప్పటికే 2012లో తన 'జుమ్మా' కథా సంకలనం కోసం కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం పొందారు. ఇప్పటిదాక ఎనిమిది పుస్తకాలు రచించిన ఈయన కథలు హిందీ, ఇంగ్లీషు, కన్నడ, తమిళం, మలయాళం, కొంకణి, మైథిలి భాషల్లోకి అనువాదమయ్యాయి. జర్నలిజంలో పిహెచ్‌డి చేసి స్కాలర్‌గా కూడా రాణించారు. ఈయన ప్రచురించిన పరిశోధన పుస్తకం టివి ప్రకటనల్లో భాష-సంస్కృతి' ఇప్పటికే పలు యూనివర్సిటీల్లో జర్నలిజం, ఎంబిఎ విద్యార్థులకు రిఫరెన్సు పుస్తకం కింద ఉంది. ఈయన రచనల్లో ఎక్కువగా మత సామరస్య అంశాలు ఉంటాయని విమర్శకులు చెబుతారు. ఇంటి ముందు ముగ్గులేసే ఒక ముస్లిం ఆడపిల్ల తర్వాత ఆ పని మానేసి అరచేతుల్లో గోరింటాకుతో ముగ్గులు వేస్తుంటుంది. ఒక మతానికి మరో మతానికి ఇంతే తేడా, దీని కోసం ఎవరూ భేషజాలకు పోవాల్సిన పని లేదని సూచించే ఈ కథను గొప్ప సామరస్య రచనగా పాఠ్యాంశ రూపకర్తలు పేర్కొన్నారు. ఈ సెమిస్టర్ లో వేంపల్లె షరీఫ్ కథతోపాటు రావిశాస్త్రి రాసిన 'పిపీలికం', పోలా ప్రగడ రాజ్యలక్ష్మి రాసిన 'నల్లపూసలు', పెనుమాక రత్నాకర్ రాసిన 'ఈ పొలం అమ్మబడును' రచనలు పాఠ్యాంశాలుగా ఎంపికయ్యాయి. రావిశాస్త్రి వంటి గొప్ప కథలతోపాటు తన కథను ఎంపిక చేసినందుకు రచయిత వేంపల్లె షరీఫ్ ఈ సందర్భంగా పాఠ్యాంశ రూపకర్తల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రచయిత వేంపల్లె షరీఫ్

# ఇసుక బుకింగ్ కోసం పడిగాపులు

### సచివాలయ సిబ్బందితో వాగ్వాదం, తోపులాట

బుకింగ్ కౌంటర్ వద్ద భారీగా గుమికూడిన ప్రజలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భవన నిర్మాణ కార్మికులు, ప్రజల నిరసనలు, వినతులు మధ్యన రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి ఆర్.బుడుగుంటపల్లె వద్ద ఇటీవల ఇసుక రీచ్ పాయింట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి సానిపాయ, రాజంపేటలోని కూచివారిపల్లెల్లో ఇసుక బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇసుక బుకింగ్ కొరకు సోమవారం కూచివారిపల్లె సచివాలయంలోని కౌంటర్ వద్ద ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే క్యూలైన్‌లలో బారులు తీరి పడిగాపులు కాశారు. రోజువారి బుకింగ్ అయిపోతుండడంతో రేపటి బుకింగ్ టోకెన్ల కోసం ఉదయం నుంచి క్యూ లైన్లలో వేచి ఉన్న ప్రజలు సహనం కోల్పోయి ఒకరినొకరు తోసుకోవడంతో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. టోకెన్ల పంపిణీ చేతకాకపోతే గేట్లు మూసివేయాలని సచివాలయ సిబ్బందితో ప్రజలు వాగ్వాదానికి దిగారు. ప్రజల సౌకర్యార్థం మరిన్ని బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# ఆటోమోటివ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌తో 'మిట్స్' ఎంఒయు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల న్యూఢిల్లీలోని ఆటో మోటివ్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు ఆటోమోటివ్ రంగంలో నైపుణ్యం పెంపొంది చడానికి ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. ఆటోమోటివ్ సెక్టార్‌లో నైపుణ్యాభివృద్ధి యొక్క శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు సర్టిఫికేషన్ కోర్సులకు యాక్సెస్‌తో సహా అనేక రకాల శిక్షణ కార్యక్రమాలను పెంపోందిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశం అంతటా ఆటోమోటివ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభత్వాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో అరిందమ్ లాహిరి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆటోమోటివ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబెర్ టిజి.రవికుమార్ పాల్గొన్నారు.

ఒప్పందం పత్రాలను స్వీకరిస్తున్న మిట్స్ కళాశాల సిబ్బంది

ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా ఇందిరానగర్ మురుగునీటి కాలువలు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు ప్రజలు తెలిపారని, తాగునీటిని ప్రతి నాలుగు రోజులకు ఒకసారి వదలాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరమైన సేవలను అందించాలన్నారు. ముఖ్యంగా ధ్రువీకరణ పత్రాలను సత్వరం జారీ చేయాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.2.80 లక్షలు పలికిన మేకవారిపల్లె లడ్డూ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గణపతి ఉత్సవాల సందర్భంగా సోమవారం మండల పరిధిలోని మేకవారిపల్లె గ్రామంలో గణపతి లడ్డు రూ.2.80 లక్షలు పలికింది. 30 కిలోల గణనాథుడి లడ్డును బొట్టా చిన్నయ్య కుమారుడు నరసింహులు వేలం పాటలో దక్కించు కున్నారు. బొట్టా వారి కుటుం బం భక్తిశ్రద్ధలతో లడ్డును మేళ తాళాలతో తీసుకెళ్లి గ్రామంలో ప్రజలకు పంచిపెట్టారు.



గణపతి లడ్డూను దక్కించుకున్న నరసింహులు

మల్లయ్యకుంటను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

## మల్లయ్య కుంటను అభివృద్ధి చేస్తాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరబల్లి

ఉపాధి హామీ చట్టం ద్వారా మల్లయ్య కుంటను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపిడిఒ మల్లీశ్వరి తెలిపారు. సోమవారం ఆమె ఎపిఒ నాగరాజ, వైసిపి నాయకుడు వీర నాగిరెడ్డితో కలిసి మల్లయ్య కుంటను పరిశీలించారు. హరిహరుల దేవాలయం దగ్గర ఉన్న మల్లయ్య కుంట చెత్త, మురుగుతో నిండి ఉండడంతో జెసిపి సహాయంతో చెత్తను తొలగించారు. ఉపాధి హామీ పథకంలో మల్లయ్య కుంటను అభివృద్ధి చేయాలని కోరారు. మండలంలో కూలీలకు పనులు కల్పించేందుకు కుంటలు, చెరువులు, కాలువలు, అభివృద్ధి చేయనున్నారు. కష్టించి పనిచేస్తే కొలతల ప్రకారం రోజువారి కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఆమె వెంట వైసిపి నాయకుడు వీరనాగిరెడ్డి, ఉపాధి ఏపీ నాగరాజా, పంచాయతీ సెక్రటరీ వరప్రసాద్, కంప్యూటర్ అసిస్టెంట్ సురేంద్ర పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె ఎస్‌బిఐ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ కాలనీకి చెందిన అశోక్ తమ ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ లీకై నీరంతా రోడ్డుపై పారుతోందని ఫిర్యాదు చేయడంతో స్పందించిన కమిషనర్ ప్రమీల అధికారులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించారు. ప్రతి సోమవారం తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఫిర్యాదు రూపంలో తెలియజేస్తే అప్పటికప్పుడు పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

## 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయచోటి

కొత్త పిఆర్‌సి అమలులోకి వచ్చేంతవరకు ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంబేపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కొత్త పిఆర్‌సి కోసం కమిటీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, సంపాదిత సెలవుల నగదు చెల్లింపు వంటి పాత బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పని సర్దుబాటులో జరిగిన లోపాలను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు స్టేట్ కౌన్సిలర్ మురళీకుమార్, డిస్ట్రిక్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రాజారెడ్డి, సంఘ నాయకులు దామోదర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి ప్రతినిధులు

## 25న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ : జెవివి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం హైస్కూల్ స్థాయిలో పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వై.నందకిషోర్ గౌడ్, ఎస్.రౌఫ్ బాష, ఎన్.రాజయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజంపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యంతో పాటు ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులచే ఈ పరీక్షను వ్రాయించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.వి.ఎస్ కిషోర్, పి.వెంకటేశ్వర్లు, ఎం.హరికృష్ణ, ఉపాధ్యాయులు రియాజ్, ఉమ, ప్రియ, శిరీష పాల్గొన్నారు.

## అనియత విద్యా బోధకులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

అనియత విద్యా బోధకులను, సూపర్‌వైజర్లను 2001లో చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసిందని, వారి స్థానంలో స్కూల్ కాంప్లెక్స్ సిర్‌పిలుగా నియమించారని, అయితే కొద్ది మందిని మాత్రమే తీసుకుని మిగిలిన వారికి అన్యాయం చేశారని, వారికి న్యాయం చేయాలని జిల్లా అనియత విద్య యూనియన్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గతంలో కొద్దిమందిని మాత్రమే సిఆర్‌పిలుగా తీసుకున్నారని, మిగిలిన వారిని కూడా తీసుకుంటామని చెప్పి, ఇంత వరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. 2011 నుంచి ఇప్పటి వరకు కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాపితంగా లక్షలాది మంది బోధకులు, సూపర్‌వైజర్ల కుటుంబాలు రోడ్డున పడిందని వాపోయారు. వారికి న్యాయం జరగకపోతే ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

## వరద సహాయక చర్యల్లో హోంగార్డులు

ప్రజాశక్తి-సుండుపల్లి

విజయవాడ వరద సహాయ చర్యల్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డులు, కానిస్టేబుళ్లు భాగస్వామ్యులయ్యారు. అక్కడ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, ఇతర సహాయక కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సాయం చేశారు. సమాజ సేవ చేసిన వారిలో పోలీసులు, హెచ్‌కానిస్టేబుల్ నరసయ్య పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసిన రోజే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పతనానికి నాంది మొదలైందని చెప్పారు. ప్రతి టిడిపి కార్యకర్తకు ఇంటి పెద్దగా ఉన్న చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం ఎంత మూర్ఖపు చర్యనో 2024 సార్వత్రిక ఎన్నికలలో తెలిసొచ్చిందని తెలిపారు. టిడిపి కార్యకర్తలు తలుచుకుంటే ఎంత దారుణమైన పరాజయంను రుచి చూపించగలరో జగన్‌కు చూపించామన్నారు. భవిష్యత్తులో కూడా ఆంధ్ర రాష్ట్రం బాగుపడాలంటే చంద్ర బాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విపత్తులు వచ్చినప్పుడు అధికార యంత్రాంగాన్ని ఎలా వినియోగిం చుకోవాలో చంద్రబాబును చూస్తే అర్థమవుతుందని తెలిపారు. టిడిపి అధినేత ప్రజల సంక్షేమం కోసం పాటుప డుతుంటే సైకో జగన్ ప్రత్యర్థి పార్టీలను, ప్రజలను ఇబ్బం దులకు గురిచేసేందుకే పనిచేస్తుంటారని పేర్కొన్నారు. ఆయన చేసే కుటిల రాజకీయాలకు భవిష్యత్తులో కూడా ఆంధ్ర రాష్ట్రంలో అధికా రంలోకి వచ్చే అవకాశం లేదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ భాష, పార్ల మెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ తుపాకుల అశోక్ కుమార్, కౌన్సిలర్ రాజేష్, సర్పంచ్ కోటయ్య నాయుడు, 8వ వార్డు అధ్యక్షులు మన్నూరు పీరు సాహెబ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్ రాజు

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడితో
ప్రజా పక్షపాతిగా వుంటూ ప్రజల హృదయంలో
చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్న ప్రజాశక్తి
దినపత్రిక మరింత పురోభివృద్ధి చెందాలని విలేకర్లకు,
సిబ్బందికి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
44వ వార్షికోత్సవం
ప్రజాశక్తి అభిమాని
కలికిరి మండలం, అన్నమయ్య జిల్లా.

ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు

## ఉట్టి విజేత మాకం సాయి

**ప్రజాశక్తి - నందలూరు**

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని ఎన్టీఆర్ నగర్‌లో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో మాకం సాయి తన్విస్ విజేతగా నిలిచి నగదు బహుమతిని కైవసం చేసుకున్నాడు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఎన్టీఆర్ నగర్, అరవపల్లి గ్రౌండ్, గాంధీ నగర్, రైల్వే గేట్ వద్ద, వినాయక చవితి పర్వదినం సందర్భంగా మూడవ రోజు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ విగ్రహాల వద్దకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి- కలకడ**

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జయభారతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళా శాలలో జువాలజీ అధ్యాపకులు బదిలీపై వెళ్లడంతో పోస్ట్ ఖాళీ ఏర్పడినట్టు తెలి పారు అతిథి అధ్యాపక జువాలజీ పోస్టుకు పీజీలో 50 శాతం మార్కులు కలిగిన అర్హులైన వారు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీన ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల ఆఫీసులో హాజరు కావలసిందిగా కోరారు.

లక్ష్మిప్రసాద్‌రెడ్డికి హోంనీడ్స్ అందజేస్తున్న యజమాని

## శ్రీసత్య హోంనీడ్స్ షోరూమ్ ప్రారంభం

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ సత్య హోంనీడ్స్ షోరూమ్‌ను రాయచోటి నియోజకవర్గ టిడిపి నేత లక్ష్మి ప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ సత్య హోంనీడ్స్ 31వ షోరూంను రాయచోటిలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయచోటి పట్టణం అభివృద్ధి చెందాలంటే ఇలాంటి షోరూములు మరిన్ని రావాలని పేర్కొన్నారు. హోంనీడ్స్ కోసం రాయచోటి ప్రజలు పెద్ద పెద్ద నాగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. శ్రీ సత్యహోంనీడ్స్ షోరూం యాజమాన్యం రాయచోటి పట్టణ ప్రజల మన్ననలు పొందాలన్నారు. వినియోగదారులకు అకట్టుకునేలా షోరూంలో ప్రత్యేకమైన ఆఫర్లను ఏర్పాటు చేశారన్నారు. రాయచోటి నియోజకవర్గ ప్రజలందరూ షోరూంను సందర్శించి అందరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిఎం ఉదయ్, బ్రాంచ్ మేనేజర్ మాద కన్నయ్య పాల్గొన్నారు.

నాగరాజును సన్మానిస్తున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

## స్వర్ణ పతక విజేతకు సన్మానం

**ప్రజాశక్తి-వీరబల్లి**

నేపాల్‌లో నిర్వహించిన నాలుగు దేశాల పవర్ లిఫ్టింగ్ ఈ వెంట్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండలానికి చెందిన నాగరాజును సోమవారం ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని సన్మానించారు. మండలంలోని ఎస్‌డికెఆర్ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలో మండలానికి పేరు తెచ్చుకున్న వంగిమళ్ళ ప్రాంతానికి చెందిన నాగరాజును అభినందించి చిన్న పాటి సత్కారం చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక నైపుణ్యంతో మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని విఆర్‌డిఎస్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుళాయిరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, అధ్యాపకులు భాస్కర్, సిబ్బంది నాయకులు కార్యకర్తలు విఆర్‌డిఎస్ సురేంద్ర రెడ్డి, ప్రిన్సిపల్ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తుల బిల్లును వెనక్కి తీసుకోవాలి

**ప్రజాశక్తి - వేంపల్లె** : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను కాజేసేందుకు తెచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా డిమాండ్ చేశారు. సోమవారం వక్ఫ్ బోర్డు ఆస్తులను వక్ఫ్‌బోర్డు పరిధి లోనే ఉండాలని, కేంద్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా ముస్లింలతో కలిసి మెసేజ్‌లను ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లును ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మెసేజ్‌లు పంపేందుకు ముస్లింలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తమ సెల్‌ఫోన్ ద్వారా బిల్లుకు వ్యతిరేకంగా మెసేజ్ పంపాలని కోరారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు ఆస్తులపై కన్ను వేసి కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులపై తెచ్చిన బిల్లును రద్దు చేయాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌తోపాటు 28 పార్టీల ఎంపీలు కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అన్ని మతాల ఆస్తులను ఆక్రమించి అదాని, అంబానీలకు కట్ట బెట్టేందుకు ప్రధాని మోడీ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ఆమ్‌అద్మీ పార్టీ నాయకులు అహమ్మద్, బాబ్జీ పాల్గొన్నారు.

**మహారాజశ్రీ లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు**

**O.S.No : 17/19**

సినూరి షేక్. హుస్సేన్ సాబ్ తండ్రి వల్లి సాబ్ R/o ఎగువ గొట్టివీడు, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా.

...వాది

V/s

సినూరి షేక్ రహంతుల్లా తండ్రి వలి సాబ్ వయసు 50 సం॥, ముస్లిం R/o ఎగువగొట్టివీడు, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది

**ప్రకటన**

పై నంబర్ గల దావాలోని వాది ప్రతివాదైనా మీ పైన బాగా పరిష్కారం కొరకు దావా వేసి దానిపై ప్లీమినరీ డిక్రీ పొంది ఉన్నాడు. ఆ ప్లీమినరీ డిక్రీలో I.A.No: 97/24 మరియు I.A.No: 98/24లో మీపైన పిటిషన్‌లు వేసి ఉన్నాడు. కనుక ప్రతివాదైన మీరు హాజరవ్వడానికి గాను వాయిదా 3.10.2024వ తేదీన ఉన్నది. ఆ తేదీన ఉదయం 10 :30 గం॥లకు వకీలా ద్వారా గాని ఖుద్దున గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకో వచ్చును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

**//By 0rder of the court//**

**S. హిదాయతుల్లా, B.A., L.L.B.,**

అడ్వకేట్,

రాయచోటి, అన్నమయ్య జిల్లా.

# గుండ్లవాండ్లపల్లె రోడ్డుకు మరమ్మతులు ఎప్పుడో?

గుండ్లవాండ్లపల్లెకు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆందోళనలో ప్రయాణికులు

**ప్రజాశక్తి-సుండుపల్లి**

మండలంలోని సుండుపల్లి పంచాయతీలో రాయచోటి-సుండుపల్లి మెయిన్ రోడ్డుపైన దిగువ గుల్లవాండ్లపల్లె సమీపంలో ఉన్న రహదారి గుంతలుగా మారి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రహదారి గుండా వెళ్తున్నా గుంతలను పూడ్చి బాగు చేయాలనే ఆలోచన రాకపోవడం శోచనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో వాహనాల రాకపోకల సమంలో సమీపంలో ఉన్న ఇళ్లల్లోకి వెళ్తున్నాయి. ఎప్పుడూ నీరు ఉండడంతో దోమల బెడద కూడా అధికంగా ఉందని వాపోయారు. పైగా రాత్రుళ్ళ వాహనదాలు గుంతలు గమనించకపోవడంతో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయని పలువురు వాపోతున్నారు. రోడ్డు మరమ్మతుల కోసం మంజూరైన నిధులను అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై స్వాహా చేశారనే ఆరోపణ బలంగా విన్పిస్తోంది. రోడ్డు మరమ్మతుల గురించి పలు మార్లు స్థానికులు అధికారులు, ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మెయిన్‌రోడ్డుపై ఉన్న గుంతలు మరమ్మతులు చేసిన ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆరోగ్య వైద్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యం

**ప్రజాశక్తి-కలకడ**

ఆరోగ్య వైద్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యమవుతుందని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పిహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూమ గర్భిణులు మేలైన ఆరోగ్యానికి, శిశువు ఎదుగుదలకు ఆరోగ్య పరీక్షలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతి మహిళకు కాన్పు పునర్జన్మ అవుతుందని చెప్పారు. మెరుగైన ఆరోగ్య సేవలు అందిపుచ్చుకుని ప్రతి గర్భిణి సురక్షిత మాతృత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ ప్రతి నెల 9వ తేదీన వారి గర్భం యొక్క నాణ్యమైన యాంటెనాటల్ కేర్ సేవలను అందించడానికి ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. గర్భిణులకు ప్రసూతి వైద్యులు నిర్దేశించిన ఆరోగ్య సౌకర్యాల వద్ద, సమగ్రమైన ప్రసవానంతరసేవలను అందించడం బరువు, ఎత్తు, అధికరక్తపోటు, మూత్ర, రక్త, మొదలగు వ్యాధుల నిర్ధారణ పరీక్షలుతమ ఆరోగ్య బృందంతో నిర్వహించి, అవరమైన వారికి ఐరన్‌ఫోలిక్యాసిడ్, కాల్షియమ్, అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి, ఆసుపత్రిలో కాన్పు ఆవశ్యకతను గూర్చి సూచన సలహాలు ఇచ్చారు. హాజరైన గర్భిణుల సంఖ్య 45 మంది కష్టతరమైన గర్భిణులు సంఖ్య 13 మంది వీరిని ఉన్నత స్థాయి సిహెచ్‌సి కేంద్రాలకు రిఫరల్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్ బాబు, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వరరావు, రెడ్డమ్మ, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ఆరోగ్య కార్యాకర్తలు వాణి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, బి.లక్ష్మి, రమణమ్మ, సి.లక్ష్మిదేవి జె.భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు రాజసులోచ, అశ్వని, కె.కనకమ్మ, గోపికృష్ణ, లావన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

గర్భిణులకు బ్రెడ్లు అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీ

**పీలేరు:** సురక్షిత మాతృత్వానికి ఆరోగ్య పరీక్షలు చాలా ముఖ్యమని తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ గర్భిణులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పిహెచ్‌సిలో ఆమె గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తల్లీ, బిడ్డపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉంటుందని సూచించారు. గర్భిణి సమయంలో తల్లి అనారోగ్యం పుట్టబోయే బిడ్డపై చెడు ప్రభావం చూపే ప్రమాదం ఉందని, మాతాశిశు సంక్షేమం కోసం ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రయోజనాలను గర్భవేతులకు వివరించారు. చెక్కెరవ్యాధి, అధిక రక్తపోటు, బరువు పెరుగుదల, రక్తహీనత, మొదలగు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి, ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్య పరీక్షలకు హాజరైన 23 మంది గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు, పాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఎఎన్‌ఎం నాగవేణి, సిహెచ్ఓ కుముద, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోలాహలంగా వినాయక నిమజ్జనం

**ప్రజాశక్తి-పీలేరు**

పట్టణంలో వినాయకుని విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. సోమవారం స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద లాంఛనంగా మొదటి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని అనేక వీధుల్లో ప్రతిష్టించిన ఉత్సవ విగ్రహాలను వాటి నిర్వాహకులు వరుస క్రమంలో ప్రత్యేక వాహనాలపై ఊరేగింపు కార్యక్రమంలోకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్య బృంద కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే సౌండ్ సిస్టంలు, టపాకాయల మోతలతో పట్టణం మారు మ్రోగింది. స్థానిక పోలీసులు విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ పట్టణంలోని పంచాయితీ మిట్టపై వినాయక విగ్రహాల స్వాగత వేదికను ఏర్పాటు చేసింది. అలాగే పట్టణ శివారులోని అయ్యప్పనాయని చెరువులో విగ్రహాల నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాట్లను చేస్తూ క్రేన్లను సమకూర్చింది. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘం, వర్తక వ్యాపార సంఘాలు ఊరేగింపులో పాల్గొన్న వారికి అల్పాహారం, జ్యూసులు, మజ్జిగ, మంచినీరు అందించారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక పర్వదినం అనంతరం మూడవ రోజున సోమవారం వినాయక నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలను యువతీ యువకులు, మహిళలు పెద్దలు కోలాహలంగా పాల్గొంటూ నిర్వహించారు. మూడు రోజులపాటు వినాయకుని మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుండి వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లెతో పాటు మండల వ్యాప్తంగా పలు ప్రాంతాలలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని స్థానిక యువత ఉత్సాహంగా నిర్వహించారు. ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా గణనాథున్ని నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు పలు ప్రాంతాలలో బందోబస్తును నిర్వహించారు. **కలికిరి:** మండలంలో ఘణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కలికిరి మేజర్ పంచాయతీలోని రాజువారిపల్లి, కలికిరి పట్టణం, గుట్టపాలెం పంచాయతీలో కె.బర్నేపల్లిలో వినాయకుని విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో యువత పాల్గొని వైభవంగా నిమజ్జనం చేశారు. భక్తి గీతాలు ఆలపిస్తూ, చెక్కభజనలు చేస్తూ గ్రామాల్లో పిల్లలు, పెద్దలు అందరూ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అందరికీ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. **కలకడ:** బొజ్జ గణపయ్య నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. మండలంలోని కలకడ, బాటవారిపల్లి, ఎర్రయ్యగారిపల్లి, గుడిబండ, ఎల్లం గుడిబండ, కోన, ఎర్రకోటపల్లి, పాపిరెడ్డిగారిపల్లి, నడించర్ల, కదిరాయి చెరువు, తదితర గ్రామాలలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం బళ్లారి డబ్బులు, యువకుల కేరింతలు, నాట్యాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఎస్ఐ రామాంజనేయులు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పీలేరు: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్య బృందం

నిమ్మనపల్లె : వినాయక నిమజ్జన ఊరేగింపులో యువకులు

**వినాయక ఉత్సవాల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా**

**మదనపల్లె అర్బన్:** పట్టణంలోని 20వ వార్డులో కౌన్సిలర్ తులసి, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు అయ్యప్ప అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో 20వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడు ఎంతో అద్భుతంగా ఉందని కితాబునిచ్చారు. కౌన్సిలర్ తులసి, సీనియర్ నాయకులు రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయని, ప్రతిరోజు భక్తులకు ప్రసాదాన్ని పంపిణి చేస్తూ మన సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతున్నారని కొనియాడారు. అనంతరం కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ వినాయక మండపాన్ని ఎమ్మెల్యే సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. బొజ్జ గణపయ్య ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది వార్డులో ఎంతో ఘనంగా వినాయక చవితి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# వరద బాధితులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి- రాయచోటి**

విజయవాడలోని ప్రాంతంలోని వరద బాధితులకు విరివిగా సాయం చేసి ఆదుకోవాలని టిడిపి యువ నాయకులు మండపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ వారం రోజుల కిందట విజయవాడ పట్టణంలో వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులను మానవతా దృక్పథంతో రాయచోటి ప్రాంతవాసులు విరివిగా సాయం చేసి ఆదుకోవాలని కోరారు. దాతల ఆర్థిక స్థోమతను బట్టి వీలైనంత ఎక్కువ మొత్తంలో ధన రూపంలో గానీ, వస్తు రూపంలో గానీ మీకు తోచినంత విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని చెప్పగానే పట్టణంలోని కంసల వీధికి చెందిన శ్రీలేఖ గార్మెంట్ యజమాని, మానవతా వాది పుష్పహన్, ఆయన సతీమణి రజిని, వారి కుటుంబ సభ్యులు సుమారు రూ. 50 వేలు విలువ చేసే ప్యాంట్లు, షర్టులు, చిన్నపిల్లల డ్రస్సులను విరాళంగా అందజేశారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని రాయచోటి పట్టణంలోని మిగిలిన వ్యాపారస్తులు, మేధావులు, టీచర్లు , విద్యార్థులు వారి స్తోమతను బట్టి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. మానవతా దృక్పథంతో సహాయం చేసిన శ్రీలేఖ గార్మెంట్ యజమాని అయినా బలను పుష్పాన్‌ను, ఆయన సతీమణిని లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అభినందించారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

ఆర్ఎస్ రోడ్డులో అన్నదానం చేస్తున్న దాతలు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆర్ఎస్ రోడ్డు వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ టీం పదవ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ వైద్యులు హీరేంద్ర సింగ్ తండ్రి లోక్ మాన్ సింగ్, మహానంది సంతోష్‌రెడ్డి, పల్లపు సాయి తేజ, పేటగడ్డలో లాయర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నీలిపల్లి రోడ్డులోని గణేష్ నగర్ వద్ద జంగం శెట్టి ఈశ్వరయ్య, జంగం శెట్టి లోకేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీలిపల్లి గ్రామంలో వినాయక స్వామి ఆలయం వద్ద దాసరి లక్ష్మీదేవి, గంగనపల్లి వెంకటరమణ, గంగనపల్లి శ్రీలక్ష్మి, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని రెడ్డిపల్లిపేట వద్ద వినాయక నిమజ్జనం పురస్కరించుకొని రొంపిచర్ల మురళి కుటుంబీకులు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువతీ, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

## భవితకు భద్రత ఏదీ..!

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న ఆటో డ్రైవర్ల ప్రవర్తన రోజు రోజుకూ శృతి మించిపోతోంది. ఆటోల్లో పెద్దపెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టడం, ద్వంద్వ అర్థాలు వచ్చేలా పాటలు పెట్టడం, పెడ అర్థాలు వచ్చేలా ఆటోల వెనుక స్లోగన్స్ తదితర వాటితో వ్యవహరిస్తున్నారు. ఆటోల్లో వెళ్లాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ బస్సుల ముందు, వెనుక ఆటోలు నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆటో డ్రైవర్లు మద్యం తాగి, గుట్కాలు నమలడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలతో ఇంకొందరు ఆటో డ్రైవర్లు ఆటలాడుతున్నారు. ఒక్కో ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదనే నిబంధనలు ఉన్నా.. వాటిని తుంగలో తొక్కేస్తున్నారు. పరిమితికి మించి విద్యార్థులను కుక్కేసి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. ఇది చూసినా పాఠశాలల యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఎంత ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే అంత ఎక్కువ మొత్తం డబ్బు వస్తుందనే ఆశతో కొందరు డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఆటోలో ఎక్కిస్తున్నారు. దీని వల్ల ఆటో అద్దె తగ్గుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. చాలా ఆటో లకు ఫిట్‌నెస్ లేకపోయినా రోడ్డుమీద తిప్పుతున్నారు. మరికొందరు డ్రైవర్లు మద్యం మత్తులో ఆటోలు నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలాంటి తప్పిదాల వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ద్విచక్ర వాహనాల్లో భార్యాభర్తలు వెళుతున్న సమయంలో వారి వెనుక ఆటోల్లో వేగంగా వస్తూ పెద్దగా హారన్లు కొడుతూ విసిగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏమి ఆటో తగిలిందా అంటూ బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇవన్నీ అధి.కారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మైలవరం నుంచి పెన్నానదికి నీరు విడుదల

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి వరద నీటిని మళ్లించడం వల్ల గండికోట రిజర్వాయర్ 25 టీఎంసీలు, మైలవరం రిజర్వాయర్ 5.5 టీఎంసీలకు చేరుకోనుందని మైలవరం జలాశయం ఎఇఇ వై.గౌతమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం రిజర్వాయర్ నుండి పెన్నా నదిలోకి నీటి విడుదలలో క్రమంగా పెంచుకుంటూ పోతామన్నారు. సోమవారం సాయంత్రం 4గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లోను 500 క్యూసెక్కుల నుండి 1000 క్యూసెక్కులకు, 10న మంగళవారం సాయంత్రం 4గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 1000 క్యూసెక్కుల నుండి 3000 క్యూసెక్కులకు, 11న బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 3000 క్యూసెక్కుల నుండి 5000 క్యూసెక్కులకు, 12న గురువారం సాయంత్రం నాలుగు గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 5000 క్యూసెక్కుల నుండి 8500 క్యూసెక్కులకు పెంచుకుంటూ పోతామన్నారు. జమ్మలమడుగు ఆర్డీఒ, డిఎస్పీతోపాటు తహశీల్దార్, ఎంపి డిఓలు ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట వరకు పెన్నా నది వెంబడి నివసించే ప్రజలను దండోరా లేదా ఏదైనా కమ్యూనికేషన్ ద్వారా అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. పెన్నా నది క్రాసింగ్ వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రజలను పెన్నా నదిలోకి అనుమతించవద్దని కోరుతున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. ధోబీలను కూడా అనుమతించవద్దన్నారు. పెన్నా నది నుండి మోటర్లు, పైపులు, స్టార్టర్లను తొలగించడానికి రైతులను అప్రమత్తం చేయాలని కోరారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని పెన్నా నది వెంబడి ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. మున్ముందు ఔట్‌ఫ్లోలు కూడా 8500 క్యూసెక్కుల కంటే ఎక్కువగా ఉంటాయన్నారు. మైలవరం రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షపాతం మీద ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

# క్రైం కార్నర్

## యాసిడ్ తాగి వివాహిత ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన సోమవారం మదనపల్లెలో వెలుగు చూసింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పుంగనూరు రోడ్డు, బసిని కొండలో నివాసం ఉంటున్న శివ పెళ్లి శుభకార్యాలకు పూల డిజైనింగ్ వంటి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆర్డర్లు ఎక్కువగా రావడంతో బిజీ అయి పోయాడు. ఇదే సమయంలో భార్య భారతి(34) వినాయక చవితి సందర్భంగా శనివారం రోజున పుట్టింటికి వెళ్తానని భర్తను అడగడంతో అతను వద్దని చెప్పాడు. తీవ్ర మనస్థాపానికి గురై పండుగ రోజు రాత్రి ఇంట్లో ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు బాధితురాలిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించారు. పరిస్థితి మరింత విషమించడంతో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. సిఐ రామచంద్ర ఆదేశాల మేరకు ఎఎస్ఐ రమణ తిరుపతికి వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన భారతి